www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 1 సెప్టెంబర్ 2024
5
చిత్తూరు



దివ్యాంగుల ఉద్యోగాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు, తిరుపతి జిల్లాలో గల దివ్యాంగులకు డ్రీం ఫౌండేషన్ ద్వారా తిరుపతిలో శిక్షణా కేంద్రాన్ని స్థాపించి అందులో వివిధ రకాల కోర్సులలో వారికి ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. కోర్సులలో శిక్షణకు 10వ తరగతి పాస్, ఫెయిల్ ఆపైన చదువు, వయస్సు 18 నుండి 32 సంవత్సరాల వరకు గల 40శాతం వికలత్వంతో సదరం సర్టిఫికేట్‌తో సెప్టెంబర్ 4వ తేదీన తిరుపతిలోని రాస్ కార్యాలయం, ఎయిర్ బైపాస్ రోడ్, తిరుపతిలో ఉద్యోగాలు కొరకు విభిన్న ప్రతిభావంతులు, హాజరు కావాలసినదిగా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రా, వయోవృద్ధుల సంకేమ శాఖ అధికారి, సహాయ సంచాలకులు శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

జాబ్ మేళా వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడప్, డిఆర్‌డిఎ సంయుక్తంగా ఈనెల 3వ తేదిన మంగళవారం స్థానిక ప్రభుత్వ ఐటిఐ చిత్తూరు కళాశాలలో, ఎస్వీసిఆర్ ప్రభుత్వ డిగ్రీ పలమనేరు కళాశాలలో నిర్వహించే జాబ్ మేళాని ఉద్యోగ అర్హత కలిగిన యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ఈ జాబ్ మేళాలకు సంబంధించిన గోడపత్రికలను శనివారం కలెక్టర్, జెసి విద్యాధరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ అవకాశాన్ని జిల్లాలోని అన్ని పంచాయతీ, వార్డు, సచివాలయాలోని పరిధిలో ఉన్న ఉద్యోగార్థులను గుర్తించి వారికి సమాచారం చేరవేయాలని కోరారు. అదేవిధంగా ఇందులో దాదాపు 10 కంపెనీలు వస్తున్నాయని, కనీస విద్యార్హత 10వ తరగతి నుండి డిగ్రీ ఫెయిల్, పాస్ అయిన 18 నుండి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన స్త్రీ,పురుష అభ్యర్థులు హాజరు కావచ్చునని తెలిపారు. ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.గుణశేఖర్ రెడ్డి, జిల్లా ఉపాధి అధికారి పద్మజ, అదనపు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.ఏకాంబరం, జిల్లా ప్లేసమెంట్ అధికారి చైతన్య, డిఆర్‌డిఏ ఎపిఎం సెల్వరాజ్ పాల్గొన్నారు. జాబ్ మేళాకు సంబంధించి ఇతర వివరాలకు చిత్తూరు : రూపేష్- 91609 40479, లోకేష్- 99635 61755, పలమనేరు :- సిసింద్రీ- 84658 30771, వినోద్- 76720 96930 నంబర్లను సంప్రదించాలని కోరారు.


జాబ్ మేళా పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

సీసీ కెమెరాలు తప్పనిసరి: ఎస్పీ


జిల్లా నేరసమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్
పోలీసింగ్ స్కిల్స్, విజిబుల్ పోలీసింగ్ పెంచే విధంగా పని చేయాలని, ప్రజలతో సామరస్యంగా, సఖ్యతతో చట్టంపై గౌరవం పెంపొందేటట్లు మెలగాలని, ఎర్రచందనం, నాటుసారా, ఇసుక అక్రమ రవాణ నేరస్తులపై ఉక్కు పాదం మోపి, పిడి యాక్ట్‌లు ప్రయోగించాలని జిల్లా నేర సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ ఆదేశించారు. జిల్లాలోని డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలతో శనివారం ఎస్పీ జిల్లా పోలీసు ట్రైనింగ్ సెంటర్ కాన్ఫరెన్స్ హాల్‌లో నెలవారీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న గ్రేవ్ అండ్ నాన్ గ్రేవ్ కేసులు, మర్డర్, డెకాయిటి, రాబరీ, ప్రాపర్టీ, వాహనాలు దొంగతనం, 174 సిఆర్‌పిసి కేసులు, మిస్సింగ్, చీటింగ్, 102 సిఆర్‌పిసి, ఐటి యాక్ట్ కేసులు, సైబర్ నేరాలు, ఇతర కేసులను సమీక్షించారు. పోలీస్‌స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాలు, ప్రస్తుత కేసుల స్థితిగతులు, నమోదైన కేసుల్లో నేరస్తుల అరెస్టు, కేసు దర్యాప్తు తీరుతెన్నులపై సంబంధిత పోలీస్ అధికారులతో ఆరా తీసి కేసుల ఫైల్స్, రికార్డ్స్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. కేసుల ఛేదింపుకు పరిష్కారానికి, నేరనియంత్రణకు దోహదం చేసే పలు సూచనలు, మెళకువలను అధికారులకు దిశానిర్దేశాలు చేశారు. కేసు నమోదు అయిన తర్వాత కోర్టులో నిందితులకు జైలు శిక్ష పడేవిధంగా చర్యలు తీసుకున్నప్పుడే బాధితులకు సరైన న్యాయం చేసినట్లు అవుతుందని పోలీస్ అధికారులకు సూచించారు. ఏదైనా దొంగతనం జరిగిన వెంటనే సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని, నేరస్థుడు వదిలిన సాక్ష్యాధారాలు, సిసి కెమెరాల ఫుటేజీలను క్రోడీకరించి ముద్దాయిలను పట్టుకొని, వారి వద్ద నుండి పూర్తిమొత్తంలో దొంగిలించబడిన సొమ్ము రికవరీ చేయాలన్నారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు

జాతీయ లోక్ అదాలత్‌లో
ఉచిత సత్వర న్యాయం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ. భీమారావు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్
సుప్రీం కోర్టు ఉత్తర్వులు, రాష్ట్ర హైకోర్టు సూచనలు మేరకు ఈనెల 14వ తేదీన జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించడం జరుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు పేర్కొన్నారు. శనివారం ఉదయం స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఛాంబర్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ, సుప్రీంకోర్టు ఆదేశాలు 14న జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టులలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్ అన్ని ప్రభుత్వశాఖ అధికారులు రెవెన్యూ, పోలీస్, బ్యాంకులు, చిట్ ఫండ్, బీమా కంపెనీలు, న్యాయవాదులతో సమావేశాలు, వర్చువల్ ద్వారా సమావేశాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఎక్కువ కేసులు పరిష్కరించి చిత్తూరు జిల్లాను రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో ఉండేలా సహకరించాలని కోరారు.

క్రీడలతో మానసికోల్లాసం: ఎమ్మెల్యే


క్రీడాపోటీల పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే మురళీ మోహన్

ప్రజాశక్తి- పూతలపట్టు: క్రీడలతో విద్యార్థులలో మానసికోల్లాసం పెంపొందుతుందని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జోనల్ క్రీడల పోటీలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్యే అధికారులు, నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 20 నుంచి 30వ తేదీ మధ్యలో నియోజకవర్గ స్థాయి జోనల్ పోటీలు నిర్వహించినట్టు తెలిపారు. ఈపోటీల్లో విద్యార్థులు చురుగ్గా పాల్గొని ప్రతిభ చాటాలని కోరారు. విద్యతోపాటు సమానంగా క్రీడలపై విద్యార్థులు మక్కువ చూపించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజులు, అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఆవులను వీధుల్లో వదిలితే జరిమానా

ప్రజాశక్తి- పుంగనూరు: ఆవులను వీధుల్లో వదిలితే వాటి యాజమాని నుండి అపరాధ రుసుం వసూలు చేయడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్ శనివారం ప్రకటనలు తెలిపారు. పట్టణంలో ఆవులను, ఎద్దులను పట్టణంలో విచ్చలవిడిగా వదిలివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రోడ్డుపై ఆవులు పడుకొని ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తున్నాయని, వీటి వలన పలు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని అన్నారు. ఆవులను పట్టణ వీధుల్లో వదిలితే ఆవులను బంధించి పురపాలక సంఘ కార్యాలయంలోకి తరలించి వారి వద్ద నుండి అపరాధ రుసుం విధించి ఆవులను యజమానులకు అప్పగించడం జరుగుతుందన్నారు. వీధి కుక్కలకు తిరుపతి అనిమల్ కేర్ సెంటర్ తరలించి ఏఆర్‌వి వ్యాక్సిన్ ఇచ్చి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసి తిరిగి పట్టణంలో వదలడం జరుగుతుందన్నారు. ప్రజలందరూ సహకరించి తమ సొంత కుక్కలను ఇంటిలోనే ఉంచుకొనవాల్సిందిగా ఆదేశాలు ఇచ్చారు. పందుల యజమానులు పందులను వీధిలో వదలకుండా ఇంటి వద్దనే ఉంచుకొని పెంచుకోవాలని అన్నారు. ఎవరైనా నిబంధనను అతిక్రమించి పందులను పట్టణంలో వదిలితే వాటి పట్టుకొని దూర ప్రాంతాలకు తరలిస్తామని హెచ్చరించారు.

పలమనేరు బాలాజీకి తెలుగు భాషా పురస్కారం



ప్రజాశక్తి- పలమనేరు: గిడుగు రామమూర్తి పంతులు గారి 161 వ జయంతిని పురస్కరించుకుని విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవంలో చిత్తూరు జిల్లా పలమనేరుకు చెందిన రచయిత, ఎంపిడిఓ పలమనేరు బాలాజీ శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చేతుల మీదుగా రాష్ట్ర తెలుగు భాషా పురస్కారం అందుకున్నారు. రచయితగా, కవిగా కాలమిస్ట్‌గా, చిత్తూరు జిల్లా రచయితల సమాఖ్య సమన్వయకర్తగా, పలమనేరు రచయితల సంఘం అధ్యక్షుడుగా, రాయలసీమ సాహిత్య సభ నిర్వాహకులలో ఒకరుగా పలమనేరు బాలాజీ తెలుగు భాషా సాహిత్య రంగాలలో మూడు దశాబ్దాలుగా కృషి చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు భాషా పురస్కారం అందుకున్న సందర్భంగా వీరికి వివిధ సాహిత్య సంఘాల రచయితలు, ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందనలు తెలియజేశారు.


90 శాతం పెన్షన్లు పూర్తి..


గంగవరంలో..

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండలం లోనినెల్లెపల్లి పంచాయతీ నెల్లేపల్లి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షులు శ్రీధర్ యాదవ్, గ్రామకమిటీ అధ్యక్షులు వెంకటేశ్ యాదవ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. అలాగే మండల కేంద్రంలో పార్లమెంట్ సెల్ ప్రధాన కార్యదర్శి దేవ సుందరం, మండల పార్టీ అధ్యక్షులు స్వామిదాస్, ప్రధాన కార్యదర్శి జ్యోతి రెడ్డి ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు.

గంగవరం: మండలంలో శనివారం వేకువజాము నుండి పెన్షన్ల పంపిణీ కార్యక్రమం మొదలుపెట్టడంతో వృద్ధులు, వికలాంగులు, పింఛనుదారులు హర్షం వ్యక్తం చేశారు. ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే పెన్షన్లు పంపిణీ 90శాతం పూర్తి చేయడంతో పింఛనుదారులు సంతోషం వ్యక్తం చేశారు. సచివాలయ ఉద్యోగస్తులు స్పందించి ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లు అందజేశారు.


వెదురుకుప్పం: మండలంలోని పెద్దపోటుచేను గ్రామంలో టిడిపి రాష్ట్ర సాంస్కృతిక విభాగ ప్రధాన కార్యదర్శి ఎన్.మునిచంద్రారెడ్డి ఆధ్వర్యంలో శనివారం పింఛన్ల పంపిణీ జరిగింది. ఇందులో భాగం ప్రమాదంలో గాయపడి మంచాన ఉన్న భరత్‌కు రూ.15,000లు అందజేశారు. క్లస్టర్ ఇంఛార్జి కోనేరు చెంగల రాయరెడ్డి, సెక్రటరీ బూత్ కన్వీనర్ బి.హిమశేఖర్ రెడ్డి, బి.జయరామ్ రెడ్డి, బూత్ కన్వీనర్ రాజశేఖర్ వర్మ, వెంకట రమణారెడ్డి పాల్గొన్నారు.


కార్వేటినగరంలో..

కార్వేటినగరం: కార్వేటినగరంలో నియోజకవర్గ కాపు సంక్షేమ అధ్యక్షులు కె.ప్రసాద్ ఆధ్వర్యంలో పింఛన్ పంపిణి చేశారు. అలాగే కొల్లాగుంటలో వైస్ సర్పంచ్ విజయ, టిడిపి నాయకులు పవన్ కుమార్ పింఛన్లు పంపిణి చేశారు. సిడి కండిగాలో టిడిపి బూత్ కన్వీనర్ దాసరి గణేష్, చిన్న కుప్పారెడ్డి, శ్రీనివాస్ యాదవ్, నరేష్ పింఛన్లు అందించారు. కార్వేటినగరం పరిసరాల ప్రాంతాలలో పొన్న యుగంధర్, రవి యాదవ్, జగన్నాథం, సందని, కేఎం పురంలో ధనంజయ రాజు, సోమశేఖర్ యాదవ్ పింఛన్లను అందించారు.

పెద్దపెంజాణి: చలమంగళం పంచాయతీలోని ముద్దేపల్లి, వడ్డూరు, సుల్లేరు గుట్టలలో పింఛన్ దారులకు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పింఛన్లను పంపిణీ చేశారు.

రామకుప్పం: మండలంలో ఎన్టీఆర్ పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం వేకువజాము నుంచే అధికారులతో పాటు టిడిపి నేతలు, కార్యకర్తలు కలిసి చురుగ్గా నిర్వహించారు. టిడిపి నేతలు, కార్యకర్తలు అధికారులతో సమన్వయం చేసుకొని 90 శాతం పైగా పెన్షన్లు పంపిణీ చేశారు.


వెదురుకుప్పంలో..

పులి సాకుతో శ్రీవారి మెట్టు వ్యాపారులు బలి

ప్రజాదృష్టి

ప్రజాశక్తి-తిరుపతి సిటి
అదిగో..పులి...ఇదిగో పులి... చిన్ననాటి కథల్లో సుపరిచితమైన కథ... కానీ ప్రస్తుతం నిజజీవితంలోనూ అన్వయించేలా టిటిడి అధికారులు వ్యవహరిస్తున్నారు. ఎక్కడో చిరుత దాడి చేస్తే... ఆ ప్రాంతానికి ఎలాంటి సంబంధం లేని చోట, దాన్ని సాకుగా చూపి వ్యాపారాలు తీసేయడం విడ్డూరం. వ్యాపారుల కడుపు కొట్టడంతో రోడ్డున పడిన కుటుంబాలు, విధిలేక 12 రోజులుగా నిరసన పోరాటాలు చేస్తున్నా, అధికారులు కన్నెత్తి చూడక పోవడం గమనార్హం. శ్రీవారినే నమ్ముకున్న శ్రీవారిమెట్టు చిరువ్యాపారుల దయనీయ పరిస్థితి ఎవరికైనా అయ్యోపాపం అనిపిస్తుంది. అయితే టిటిడిలో మాత్రం ఏమాత్రం చలనం లేకపోవడం శోచనీయం.

దాదాపు 20 సంవత్సరాలుగా శ్రీవారి మెట్టు ప్రాంతంలో సమోసాలు, పబ్బిళ్లలు, బిస్కట్లు, శీతల పానియాలు, టీలు, కాఫీలు అమ్ముకునే చిరువ్యాపారుల కడుపుకొడుతూ టిటిడి వ్యవహరించడం బాధాకరం. తిరుమల ఘాట్ రోడ్లలో పులులు, ఎలుగుబంట్ల సంచారం తరచూ జరుగుతూనే ఉంటాయి. కానీ అలిపిరి నడకమార్గంలో చిరుత సంచారాలతో భక్తుల్లో భయాందోళనలు కలిగాయి. 2023, మే 20న అలిపిరి ఆఖరి మెట్టు వద్ద రెండు చిరుతులు సంచరించాయి. జూన్ 22న 7వ మైలు ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో ఆదోనికి చెందిన కుటుంబంలోని ఓ చిన్న బాలుడిని చిరుత నోటకరుచుకుని వెళ్లడాన్ని చూసిన సెక్యూరిటీ గట్టిగా అరవడంతో బాలుడిని కొంత దూరం తీసుకెళ్లి అక్కడే పడేసి పోయింది. గాయాలపాలైన బాలుడిని తిరుపతి బర్డుకు తరలించి, చికిత్స అందించారు. అదే ఏడాది ఆగస్టు 11వ తేది రాత్రి అలిపిరి నడకమార్గంలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయం వద్ద నడిచి వెళుతున్న బాలికను చిరుత నోట కరుచుకుని అడవిలోకి తీసుకెళ్లింది. ఉదయం బాలిక శవంగా బయటపడింది. దీంతో నడకమార్గంలో రాకపోకలను టిటిడి నిలిపివేసింది. కొన్ని రోజుల తర్వాత కొంత మంది సెక్యూరిటీతో భక్తులను అనుమతించారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే భక్తులకు అనుమతి ఇచ్చారు. తర్వాత చిన్నపిల్లలకు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మాత్రమే అనుమతి ఇచ్చారు. ఇలా దశలవారీగా భక్తులను అనుమతులు ఇచ్చారు. కానీ ఆ సమయంలో అలిపిరి నడకదారిలో, శ్రీవారిమెట్టు మార్గంలో వ్యాపారాలను టిటిడి అధికారులు మూయించేశారు. ఆ తర్వాత వ్యాపారాలకు అనుమతి ఇచ్చారు. వైసిపి హయాంలో మంత్రి అనుచరులు శ్రీవారి మెట్టుమార్గంలో వ్యాపారాలు చేసుకునే 31 మంది పై దాడి చేసి, అమానుషంగా గాయపరిచారు. దీనిపై వ్యాపారులు ఉద్యమిస్తే, టిటిడి స్పందించకపోగా వ్యాపారాలనే మూయించేశారు. ఇదేమని అడిగితే నడకదారిలో పులి సంచారం ఉందని, వ్యాపారాలకు అనుమతి ఇవ్వమని చెప్పారు. వాస్తవానికి అలిపిరి మార్గంలో చిరుత దాడి జరిగింది. చిరుత దాడి జరిగిన మూడు ప్రాంతాల్లో వ్యాపారాలు కొనసాగుతున్నాయి. పైగా కొత్తగా షాపులను కూడా కేటాయించారు. ఇందులో ఫారెస్టు అధికారులే ఎక్కువ చొరవ చూపడం గమనార్హం. కానీ చిరుత, వన్యమృగాల సంచారం తక్కువుగా ఉండే శ్రీవారి మెట్టు మార్గంలో మాత్రం వ్యాపారాలకు పులిని సాకుగా చూపి వ్యాపారులను బలిచేయడం బాధాకరం. 20 సంవత్సరాలకు పైగా వ్యాపారాలు చేసుకుంటున్న వారిని ఉన్నఫళంగా వెళ్లగొట్టడంతో 31 కుటుంబాలు రోడ్డున పడ్డాయి. దీంతో సిఐటియు ఆధ్వర్యంలో వ్యాపారులు ఐక్యంగా టిటిడి పరిపాలన భవనం వద్ద ఈ నెల 21 నుంచి రిలే దీక్షలకు దిగారు. ప్రతి రోజూ మోకాళ్లపై కుర్చోని, పొర్లుదండాలతో, అర్ధనగ్న ప్రదర్శనలు, ఒంటికాళ్లపై, బిక్షాటన, వంటావార్పు ఇలా రోజుకొక్క రీతిలో వినూత్న పద్ధతులో నిరసన వ్యక్తం చేస్తున్నా అధికారులు స్పందించడం లేదు. ఇప్పటికైనా టిటిడి ఉన్నతాధికారులు స్పందించి శ్రీవారి మెట్టు చిరు వ్యాపాలుకు న్యాయం చేయాలని వ్యాపారులు, వారి కుటుంబ సభ్యులు, ప్రజాసంఘాల నేతలు కోరుతున్నారు.


దీక్షా శిబిరంలో తల్లిదండ్రులకు మద్దతుగా పిల్లల నిరసన (ఫైల్)

సహాయ కమిషనర్‌గా అవినేని ప్రసాద్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్
చిత్తూరు నగరపాలక సంస్థ సహాయ కమిషనర్‌గా అవినేని ప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు నగరపాలక సంస్థ టౌన్ ప్రాజెక్టు ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా చిత్తూరు నగరపాలక సంస్థ సహాయ కమిషనర్‌గా నియమితులయ్యారు. సహాయ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అవినేని ప్రసాద్‌కు నగరపాలక అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.


నగర పాలక సంస్థ సహాయ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రసాద్

శిఖండి మూవీ పోస్టర్ విడుదల

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: కేకే ఫిలిమ్స్ సమర్పణలో చిత్తూరులో ఉన్న కళాకారులను ప్రోత్సహింస్తూ కోడి కిషోర్ కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం వహించిన శిఖండి సినిమాలో ప్లాస్టిక్ మహమ్మారిని రూపుమాపాలని నేపథ్యంలో రూపొందించినట్లు తెలిపారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శిఖండి సినిమా పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ త్వరలో సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుని సినిమాను విడుదల చేయుటకు సన్నాహాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సినిమాను సెప్టెంబర్ చివరి మాసంలో కానీ అక్టోబర్ మొదటి రెండు వారాల్లో గాని మంచి ముహూర్తాన్ని చూసుకొని రిలీజ్ చేయుటకు సన్నాహాలు చేస్తున్నామని, అన్ని హంగులు కలిగిన ఈ సినిమాను ప్రేక్షక దేవుళ్ళు ఆదరిస్తారని మనస్ఫూర్తిగా కోరుతున్నట్లు తెలిపారు. నటీనటులు చంద్రశేఖర్, గంజి రామమూర్తి, ఏకే.మురుగేషన్, శంకర్, టీవీ శ్రీనివాసులు, విజయకుమార్, పాండురంగన్, నాగకుమార్, ఉదయ్ కిరణ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నర్సింగ్ కళాశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం నర్సింగ్ కళాశాలలో నర్సింగ్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఘనంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ కె.రాము, డీన్ ఆర్‌ఆర్ కాలేజీ ఆఫ్ నర్సింగ్ బెంగళూరు వారు నర్సింగ్ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నర్సింగ్ సిబ్బంది అందించే సేవలు అత్యంత అమూల్యమైనవి అన్నారు. రోగుల ప్రాణాలు నిలబెట్టేందుకు వారు చేసే కృషి వెలకట్టలేమన్నారు. కళాశాల చైర్మన్ బీసీ నాగరాజు మాట్లాడుతూ నర్సింగ్ సిబ్బంది వృత్తి పట్ల అంకిత భావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ సునీల్ రాజ్, చైర్‌పర్సన్ శాంతా నాగరాజ్, సీఈఓ సాగర్ రాజ్, ప్రిన్సిపాల్ విమల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయ పాలిటెక్నిక్ స్పాట్ కౌన్సిలింగ్

ప్రజాశక్తి- పుంగనూరు: పుంగనూరు వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలకు స్పాట్ కౌన్సిలింగ్ గుంటూరులో నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే.మంజుల శనివారం ఓ ప్రకటనలు తెలిపారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధి పుంగనూరులోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలకు అడ్మిషన్ల కొరకు ఇప్పటికే ఆన్లైన్ దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకొని వారు పదో తరగతి పాస్ అయినా లేదా ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన విద్యార్థులకు గుంటూరులోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం కృష్ణ ఆడిటోరియంలో స్పాట్ కౌన్సిలింగ్ జరుగుతుందని చెప్పారు. ఈ కోర్స్ కాలవ్యవధి రెండు సంవత్సరాలు అని ఈ కోర్సులు పదవ తరగతిలో వచ్చిన మార్కులు లేదా మెరిట్ ఆధారంగా సీటు కేటాయించడం జరుగుతుందన్నారు. డిప్లమా కోర్సు పూర్తి అయిన తర్వాత విద్యార్థులకు బీఎస్సి హానర్స్, అగ్రికల్చర్‌తో పాటు ఇతర డిగ్రీ కోర్సుల్లో ప్రవేశం, ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వీటిని గమనించి ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 90104 02068, 9493253151, 9491459956 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

'అభివృద్ధికి చిరునామా టిడిపి ప్రభుత్వం'

పలమనేరు ఎమ్మెల్యే ఎన్. అమరనాథరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

ప్రజాశక్తి- పెద్దపంజాణి: ఉమ్మడి రాష్ట్రంలో అన్నిరంగాల్లో రాష్ట్రం అభివృద్ధి చెంది, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో కూడా అభివృద్ధికి తెలుగుదేశం ప్రభుత్వమే కారణమని ప్రజలు విశ్వసిస్తున్నారని ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని చలమంగళం పంచాయతీలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన రెండు నెలల్లోనే అభివృద్ధి పనులను చేసి చూపి తన పనితీరును మరోమారు కనబరిచారని తెలిపారు. చలమంగళం పంచాయతీ పరిధిలో రూ. 2.22 కోట్లతో 4.20 కి.మీ మేర జరుగుతున్న రోడ్డు పనులను పూర్తి చేస్తామని అన్నారు. ఇప్పటికే ముద్దేపల్లి, ఎగువ ముద్దేపల్లి, దిగువ ముద్దేపల్లి కొత్తూరు, సుల్లేరు గుట్టలలో జరిగిన రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ముద్దేపల్లిలో గ్రామస్తులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు అభివృద్ధి పనులను చేపడుతున్నామని, గత పాలకులు తనపై చేసిన దుష్ప్రచారంపై ఇప్పటికైనా ప్రజలు గ్రహించాలని ఆయన కోరారు. జీవితాంతం తన ప్రజాసేవలోనే రాణిస్తానని భవిష్యత్తులోనూ మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేసుకుందామని తెలియజేశారు. దశాబ్దాలుగా కలగన్న తమకలను రెండు నెలల్లోనే నెరవేర్చినందుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీడీవో అబ్దుల్ రహీం, పంచాయతీ సెక్రటరీ శశి కళ, ఏపీఎం కృష్ణప్ప, మాజీ ఎంపీపీ విజయభాస్కర్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు ఆనంద్, చలపతి, సుధాకర్ రెడ్డి, రోజారెడ్డి, శ్రీరాములు, భాను ప్రతాప్‌రెడ్డి, నాగిరెడ్డి, భాస్కర్, భావాజాన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు యుపిఎస్సీ నేషనల్ డిఫెన్స్ అకాడమీ పరీక్ష

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: సెప్టెంబర్ 1న ఆదివారం యుపిఎస్సీ నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నావల్ అకాడమీ, కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. తిరుపతి జిల్లాలోని మూడు కేంద్రాల్లో 821 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్ తెలిపారు. శనివారం ఉదయం కలెక్టరేట్‌లోని డిఆర్‌ఒ ఛాంబర్‌లో యుపిఎస్సీ పరీక్ష నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో యుపిఎస్ సెక్షన్ ఆఫీసర్ శశిభూషణ్, తిరుపతి ఆర్‌డిఒ నిశాంత్‌రెడ్డి, సెట్విన్ సిఇఒ మురళీకృష్ణ, ఎపిఎంఐపి సతీష్, డిఎంహెచ్‌ఒ డాక్టర్ శ్రీహరి పాల్గొన్నారు.

స్విమ్స్‌లో రెండో వెబ్ కౌన్సిలింగ్‌కు దరఖాస్తులు

ప్రజాశక్తి - తిరుపతి సిటి: స్విమ్స్‌లో బిఎస్‌సి నర్సింగ్, బిపిటి, బిఎస్‌సి పారా మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి రెండో వెబ్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ ఆర్ బిట్లా తెలిపారు. 3-4 తేదీల్లో స్విమ్స్ వెబ్‌సైట్‌లో పొందుపరచిన లింక్ ద్వారా కోర్సుల ఎంపికను దరఖాస్తు చేసుకోవాలన్నారు. స్విమ్స్ వెబ్‌సైట్‌ను వివరాల కోసం సంప్రదించాలని పేర్కొన్నారు.

'చెకుముకి' సంబరాల పోస్టర్ విడుదల

ప్రజాశక్తి - రేణిగుంట: సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలల్లో పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో జరగనున్న చెకుముకి సంబరాల పోస్టర్‌ను జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శనివారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. మండల కార్యదర్శి కుప్పస్వామి, అధ్యక్షులు ఇమామ్, ఒ.వెంకటరమణ, ప్రధానోపాధ్యాయురాలు విష్ణువర్ధనం, ఉపాధ్యాయులు గుర్రప్ప, దీపికారాణి, ఉమామహేశ్వరి, శారద పాల్గొన్నారు.

'వన సంరక్షణకు చెట్ల పరిరక్షణే మార్గం'

ప్రజాశక్తి- కుప్పం రూరల్: వన సంరక్షణకు చెట్ల పరిరక్షనే మార్గమని ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. కుప్పం మండలం నడుమూరు పంచాయతీ కార్తీక వనంలో అటవీశాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీతో పాటు కుప్పం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ పిఎస్.మునిరత్నం, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ అంతరిస్తున్న అటవీ సంపదను సంరక్షించడంలో అటవీశాఖ అధికారులతో పాటు ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అడవులు అంతరించిపోవడం వల్ల మానవాళికి పెనుప్రమాదం పొంచి ఉందని, అందులో వాతావరణ కాలుష్యం ప్రథమమని అన్నారు. కావున ప్రతిఒక్కరూ చెట్లను నాటడంతో పాటు వాటిని పరిరక్షించి పర్యావరణ కాలుష్యాన్ని నివారించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్సీ, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి స్వయంగా చెట్లను నాటారు.



యాదమరిలో ఎమ్మెల్యే

శాంతిపురం: మన రేపటి కోసం ప్రతి ఒక్కరు ఒక చెట్టును నాటాలని ఐసిడిఎస్ శాంతిపురం ప్రాజెక్టు సిడిపిఒ కల్పన అన్నారు. శనివారం తల్లి పేరు మీద ఒక చెట్టు మన రేపటి కోసం అనే కార్యక్రమంలో భాగంగా ఆరిముత్తనపల్లి అంగన్వాడీ కేంద్రంలో చెట్లు నాటే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. చెట్లను నాటి పెంచడం వల్ల మనకు మన భవిష్యత్తు తరాలకు కలిగే ఉపయోగాలను తల్లులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అంగన్వాడీ కేంద్రాల్లో చెట్లను నాటారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ సుగుణ, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



శాంతిపురంలో..

చిత్తూరు డెస్క్: వనం మనం కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వామి కావాలని పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీ మోహన్ అన్నారు. శనివారం యాదమరి మండలం దాసరపల్లె గ్రామపంచాయతీలో వనం మనం కార్యక్రమం భాగంగా బ్లాక్ ప్లాంటేషన్ కింద శ్రీ రంగనాథ స్వామి దేవస్థానంలో కొబ్బరి మొక్కలను నాటారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా చెట్లు, ప్రభుత్వ సంస్థల్లో చెట్లు, ప్రభుత్వ స్థలాలు ఉన్నచోట బ్లాక్ ప్లాంటేషన్ కింద కొబ్బరి, మామిడి, అల్లనేరేడు నిమ్మ చెట్లు నాటించాలని తెలిపారు. సహాయ పతక సంచాలకులు డాక్టర్ బి.సుబ్రహ్మణ్యం, ఎండిఒ శివరాజు, ఎమ్మార్వో పార్థసారథి, ఏపీవో బాల, టెంపుల్ ఈవో సుబ్రహ్మణ్యం, సర్పంచి సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం: మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ కొత్తపల్లి మిట్ట అంగన్వాడీ కేంద్రంలో తల్లి పేరు మీద ఒక చెట్టు మన రేపటి కోసం అనే కార్యక్రమం పుల్లూరు, కొత్తపల్లి సెక్టార్ అంగన్వాడీ టీచర్లకు ఆన్‌లైన్ ద్వారా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శనివారం కార్వేటినగరం ఐసిడిసి ప్రాజెక్ట్ కార్యాలయం నుంచి పూర్ణచంద్ర ప్రసాద్ అంగన్వాడీ టీచర్లకి అవగాహన కల్పించారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడి టీచర్లు , గ్రామస్తులచేత మొక్కలు నాటించాలని తెలిపారు. పుల్లూరు కొత్తపల్లి సెక్టార్ అంగన్వాడీ టీచర్లు సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్ఆర్‌పురంలో అవగాహన

ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ, కోర్టు సిబ్బంది తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ. భీమారావు పేర్కొన్నారు. శనివారం ఉదయం స్థానిక జిల్లా కోర్టులో జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి వెన్నెలతో కలిసి జిల్లా న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో ద్విచక్రాల వాహనాలపై ప్రయాణించే కోర్టు సిబ్బంది హెల్మెట్ ధరించాలన్న అంశంపై న్యాయాధికారులకు, న్యాయవాదులకు, కోర్టు సిబ్బందికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి అధ్యక్షత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రమాదా సమయాల్లో ఎక్కువ శాతం మంది హెల్మెట్ ధరించకపోవడంతో మరణిస్తున్నారని తెలిపారు. రోడ్డు ప్రమాదాలలో 90శాతం ద్విచక్ర వాహనం నడిపే వారి వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ ప్రమాదాలు నివారించాలంటే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు.

అతిథి అధ్యాపకులకు అవకాశం

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకులకు అవకాశం కల్పిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జింక లక్ష్మీనారాయణ తెలిపారు. కళాశాలలో కామర్స్, కంప్యూటర్ సైన్స్ (నాన్ – శాంక్షన్ పోస్టులు), బాటని, గణిత శాస్త్రం (శాంక్షన్ పోస్టులు) పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. సంబంధిత సబ్జెక్ట్‌లో ఎంకాం, ఎంఎస్సీ మ్యాథ్స్, ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్ లేదా ఎంసిఎ, ఎంటెక్ కంప్యూటర్స్, ఎంఎస్సీ బాటని సబ్జెక్ట్‌లో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని, ఏపి సెట్, యూజిసి నెట్, పీహెచ్డీ కల్గిన వారికి మొదట ప్రాధాన్యత ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి డెమో నిర్వహించి, విద్యార్థుల అభిప్రాయాన్ని సేకరించి మెరిట్ ప్రకారం నియామకం చేస్తామన్నారు. ఆసక్తి కలవారు ఈనెల 5 తేదీ లోగా దరఖాస్తులను నేరుగా కళాశాలలో కానీ, లేదా ఆన్లైన్ ద్వారా కానీ పంపవచ్చు అన్నారు. మరిన్ని వివరాలకు 94400 44562, 99636 99446 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

బడి ఈడు పిల్లలను గుర్తించాలి

జిల్లా సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారి వెంకట రమణారెడ్డి



అంగన్వాడీ సెంటర్‌లో తనిఖీ చేస్తున్నవెంకట రమణారెడ్డి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: బడి ఈడు పిల్లలను గ్రామాల్లో గుర్తించాలని జిల్లా సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి వెంకట రమణారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని తగ్గువారిపల్లి అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలని పనిలో కాదని, గ్రామాల్లోని అంగన్వాడి కార్యకర్తలు ప్రతి పిల్లవాడు ఏ బడికి పోతున్నాడని సర్వే చేపట్టాలని బడి మాన్పించి పనులకు వెళుతున్న వారిపై ఉన్నత అధికారులకు సమాచారం అందించి వారిని బడికి పంపే విధంగా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు నాగేశ్వరరావు, రమేష్ బాబు, అంగన్వాడీ కార్యకర్త రత్నకుమారి పాల్గొన్నారు.

'ఆంక్షలు లేని అనుమతులు మంజూరు చేయాలి'

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: వినాయక చవితి మండపాలకు ఆంక్షలు లేని అనుమతులు మంజూరు చేయాలని, అలాగే మండపాల వారికి ఉచిత కరెంటు ఇవ్వాలని చిత్తూరు నగర గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షులు ఎంజి.రామభద్ర కోరారు. శనివారం ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండపాల వారు అధికారులకు సహకరిస్తూ సాంప్రదాయబద్ధంగా పండగ జరుపుకోవాలని కోరారు. మండపాల వద్ద అశ్లీల సినిమా పాటలు వేయకుండా భక్తి పాటలు మాత్రమే వాడాలని కోరారు. కార్యక్రమంలో సమితి సభ్యులు వెంకటేష్, హరిప్రసాద్ చౌదరి, కరుణాకర్ సిద్ధా, వేలు, శివకుమార్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యరహిత సమాజాన్ని సృష్టించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - తిరుపతి సిటి : మాదక ద్రవ్య రహిత సమాజాన్ని సృష్టించాలని ఎస్‌పి సుబ్బరాయుడు ఉద్ఘాటించారు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ, పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వ్యతిరేక ర్యాలీని ఎస్వీ యూనివర్సిటీ పరిపాలనా భవనం నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకూ నిర్వహించారు. వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి వెంకటరావు, డిఎస్‌పిలు వెంకట నారాయణ, రామకృష్ణాచారి పాల్గొన్నారు.

తిరుపతికి మరో రెండు బస్సులు



ప్రజాశక్తి- కుప్పంటౌన్: కుప్పం నుంచి తిరుపతికి మరోరెండు బస్సు సర్వీసులను ప్రజలకు అందుబాటులోనికి తీసుకువచ్చారు. ఈ బస్సు సర్వీసులను శనివారం ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, స్థానిక టిడిపి నాయకులు, ఆర్టీసీ సిబ్బందితో కలిసి, పూజా కార్యక్రమాలను నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీతో పాటు కుప్పం పురపాలక సంఘం టిడిపి అధ్యక్షులు రాజ్ కుమార్ బస్సులను నడిపి ప్రారంభించారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి- కుప్పంరూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు పదవీబాధ్యతలు స్వీకరించినప్పుడే కుప్పం నియోజకవర్గ అభివృద్ధి ప్రారంభమైందని స్థానిక టిడిపి నాయకులతో పాటు ప్రజలలో సైతం నమ్మకం కలిగింది. ఈ నమ్మకాన్ని నిజం చేస్తూ నియోజకవర్గంలోని చెక్కునత్తం గ్రామంలో సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ పిఎస్.మునిరత్నం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ప్రేమ్‌కుమార్, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మణి, నాయకులు సత్యేంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ అభివృద్ధికి ఉపాధ్యాయులు కీలకం

ఎంఈఓ నాగేశ్వరరావు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: సమాజ అభివృద్ధికి ఉపాధ్యాయుల కీలకమని మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు అన్నారు. శనివారం మండల కార్యాలయంలో కొత్త వెంకటాపురం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న మునివెంకటయ్య పదవీ విరమణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంఈఓ నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి రంగంలో గురువు ద్వారానే విద్యను అభ్యసిస్తారని, గురువు లేనిది ఏ రంగం అభివృద్ధి చెందదని, ప్రతి ఒక్కరు గురువులను గౌరవించడం గురుతత్వాన్ని కాపాడడం చేయాలని అన్నారు. అనంతరం మునివెంకటయ్యకు దృశ్యాలతో సన్మానం చేశారు. మండల విద్యాశాఖ అధికారి 2 రమేష్‌బాబు, ప్రధానోపాధ్యాయులు పార్థసారథి, ఉపాధ్యాయులు సరిత, మల్లికా, ధనంజయరాజా, ఇందిరాణి, లక్ష్మీపతి సిఆర్‌పి సుశీల పాల్గొన్నారు.



మునివెంకటయ్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



ప్రజాశక్తి - రామకుప్పం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం ద్వారా ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. శనివారం స్థానిక జడ్పీ బాలుర పాఠశాలలో 500 మందికి పైగా కంటి పరీక్షలు చేపట్టి ఉచితంగా మందులు పంపిణీ చేసి కంటి ఆపరేషన్లు అవసరం ఉన్న వారిని గుర్తించారు. ఈ సందర్భంగా టిడిపి నేతలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరు కంటి చూపుతో జీవించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఆదివారం కూడా కంటి పరీక్షలు కొనసాగుతుందన్నారు. ఈఅవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో తహశీల్దార్ బాబు, ఎంపీడీవో ఈశ్వరన్, కంటి వైద్యులు, టిడిపి రాష్ట్ర నేతలు మునస్వామి, నారాయణ చారి, మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, కార్యదర్శి నరసింహులు, ఆంజనేయ రెడ్డి, రామ్మూర్తి, గంట్లప్ప గౌడు, రామకృష్ణప్ప, పెరుమాళ్, వెంకటరమణ పాల్గొన్నారు.

దళిత సమస్యలపై ప్రత్యేక దృష్టి: తహశీల్దార్

ప్రజాశక్తి- వి కోట: మండల పరిధిలోని దళితుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ పార్వతమ్మ తెలిపారు. మండల పరిధిలోని బాలేంద్రపల్లి గ్రామంలో శనివారం సివిల్ రైట్స్ డేను నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం దళితుల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని, అర్హులైన ప్రతి ఒక్కరూ వివిధ శాఖల అధికారుల సమన్వయంతో వాటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ సమావేశాల్లో దళిత నేతలు నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పండ్ల తోటల పెంపకం, మినీ షెడ్లతోపాటు వివిధ రకాల పనులను ఎస్సీ, ఎస్టీలు చేసుకోవాలని ఏపీవో అశోక్ రెడ్డి తెలిపారు. అంటరానితనం నిర్మూలనతో పాటు దళితులపై జరిగే దాడులను అరికట్టేందుకు కఠినమైన చట్టాలు ఉన్నాయని ఎస్సై బాబు తెలిపారు. మండల పరిషత్ ద్వారా జరిగే అభివృద్ధి పనుల్లో ఎస్సీ,ఎస్టీలకు కేటాయించిన పనులను అర్హులైన వారు వినియోగించుకుని ఆర్థికంగా ముందుకెళ్లాలని ఎంపీడీవో మహమ్మద్ రఫీ తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నేతలు గణపతి, శివరాం, గ్రామస్తులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ పార్వతమ్మ

అమెరికన్ లేజర్ ఐ ఆస్పత్రిలో ఉచిత వైద్యసేవలు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

అమెరికన్ లేజర్ ఐ ఆస్పత్రిలో ఎన్టీఆర్ వైద్యసేవ, ఇహెచ్ఎస్ ద్వారా ఉచిత కంటి వైద్యసేవలు ప్రారంభమయ్యాయి. సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ, జిల్లాకార్యదర్శి మురళి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, సంస్థ డైరెక్టర్ పార్థసారథి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అరుణ పాల్గొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ 23 బ్రాంచిలు కలిగిన అతి పెద్ద ఐకేర్ నెట్ వర్కు అమెరికన్ లేజర్ ఐ ఆస్పత్రి తిరుపతి బ్రాంచిలో అత్యాధునిక పరికరాలతో నాణ్యమైన కంటి వైద్యాన్ని అందిస్తోంది. శనివారం నుంచి తెల్లరేషన్ కార్డు కలిగిన వారికి ఎన్టీఆర్ వైద్యసేవలు, ప్రభుత్వ ఉద్యోగులకు ఇహెచ్ఎస్ ద్వారా ఉచిత కంటి వైద్యవ అందించనుంది. ఈ సదవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బ్రాంచి హెడ్ తెలిపారు



క్రైం న్యూస్

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న టూటౌన్ సీఐ నెట్టికంటయ్య

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరానికి చెందిన ఓ వ్యాపారి ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. టూ టౌన్ సిఐ నెట్టికంటయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిత్తూరు నగరం సామిరెడ్డివీధికి హరి బడ్డీకొట్టు వ్యాపారం చేసేవాడు. శనివారం ఉదయం 6 గంటల సమయంలో చిత్తూరు నగరంలోని తేనెబండ ధర్మరాజుల గుడి సమీపంలోని ఓ కార్ పార్కింగ్‌లో హరి మృతదేహం ఉన్నట్లు పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. దీంతో హుటాహుటిన సిఐ నెట్టికంటయ్య, ఎస్సై ప్రసాద్, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. తెల్లవారుజామునే తన ఇంటి నుంచి కార్ పార్కింగ్ స్థలానికి చేరుకుని డ్రైవర్‌తో కొంతసేపు ఫోన్‌లో మాట్లాడినట్లు పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. అప్పుల పాలవ్వడంతో జీవితంపై విరక్తి చెంది హరి తన శరీరంపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు టూ టౌన్ సిఐ నెట్టికంటయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయురాలు ఆత్మహత్య

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం మండలం పెద్దబంగారునత్తం చెరువులో ఓ మహిళ శవాన్ని గుర్తించినట్టు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మహిళ మృతదేహాన్ని చెరువు నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా మృతురాలు కుప్పం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న శ్రీదేవిగా గుర్తించారు. ఆమె చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్టు కుటుంబ సభ్యులతో పాటు బంధువులు అనుమానిస్తున్నారు. మృతురాలి మరణానికి గల కారణాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

10 కేజీల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి- పూతలపట్టు: మహిళ నుంచి 10 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్న ఘటన పూతలపట్టు మండలం ఎం బండపల్లి వద్ద చోటుచేసుకుంది. పోలీసుల వివరాలు మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన సారా కొండమ్మ (26) రైలు ద్వారా తిరుపతికి చేరుకొని అక్కడ నుంచి బస్సులో ఎం బండపల్లి వద్ద దిగి గంజాయి అమ్మడానికి ప్రయత్నిస్తుండగా పూతలపట్టు పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు మహిళను అరెస్టు చేసినట్టు సమాచారం పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నేను వైసిపిలోనే ఉంటా..! : ఆర్‌కె రోజా

ప్రజాశక్తి -తిరుమల



శ్రీవారి సేవలో ఆర్‌కె రోజా

సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓటమి తర్వాత మాజీ మంత్రి, నగరి మాజీ ఎమ్మెల్యే ఆర్‌కె రోజా పెద్దగా బయట కనిపించడం లేదు. దీంతో వైసీపీ దారుణ పరాభవంతో ఆమె పార్టీ మారుతున్నారని మాత్రం పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. తమిళనాడులో నటుడు విజయ్ పెట్టిన పార్టీలో ఆమె చేరుతారని కొద్దిరోజులుగా వదంతులు వినిపిస్తున్నాయి. ఏపీ రాజకీయాలకు గుడ్‌బై చెప్పి తమిళనాట రాజకీయ ప్రవేశం చేయబోతున్నారనే టాక్ నడుస్తుంది. దీనిపై తాజాగా రోజా స్పందించారు. శనివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. పార్టీ మారుతున్నట్లు జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని.. అదంతా ఊహాగానమే అని రోజా తెలిపారు. తాను ఏ పార్టీ మారడం లేదని రోజా స్పష్టం చేశారు. పార్టీ మారుతున్న వారు ఒకసారి పునరాలోచించు కోవాలని సూచించారు. పార్టీకి ద్రోహం చేసిన వారిని ఎవరూ క్షమించరని తెలిపారు. ఎంతమంది పార్టీ వీడినా వైసీపీకి వచ్చే నష్టమేమీ లేదని పేర్కొన్నారు. కొద్దిరోజులుగా ఏపీలో మహిళలపై జరిగిన ఘటనల పట్ల కూటమి ప్రభుత్వం సిగ్గుపడాలని రోజా విమర్శించారు. ఏపీలో మహిళలకు రక్షణ కరువైందని రోజా అన్నారు. నంద్యాల జిల్లా ముచ్చుమర్రి ఘటనలో 60 రోజులు అవుతున్నా ఆ పాప శవాన్ని ఇంకా కనిపెట్టలేకపోయారని విమర్శించారు. కాలేజీ హాస్టల్ బాత్‌రూమ్‌లో కెమెరాలు పెట్టి పైశాచిక ఆనందం పొందుతున్నారని విమర్శించారు. గుడ్లవల్లేరులో ఏం జరగలేదని ఎస్పీ అనడం దురదష్టకరమని అన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుపై కాకుండా.. మహిళలకు రక్షణ కల్పించడంపై ప్రభుత్వం దష్టిపెట్టాలని హితవు పలికారు.

వర్షాల్లో అప్రమత్తంగా ఉండాలి : సిఎండి

ప్రజాశక్తి - తిరుపతి సిటి తుఫాను కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా పర్యవేక్షణకు నోడల్ ఆఫీసర్లను నియమించినట్లు ఎపిఎస్పిడిసిఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోష రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎపిఎస్పిడిసిఎల్ పరిధిలో తుఫాను కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన సందర్భాల్లో సరఫరా పునరుద్ధరణ పనులను నోడల్ ఆఫీసర్లు పర్యవేక్షిస్తారని తెలియజేశారు. సంస్థ వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం ద్వారా సమస్యలను అధికారుల దష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చని సూచించారు.

సార్వత్రిక విద్యతో ఉజ్వల భవిష్యత్ : డిఇఒ

ప్రజాశక్తి - తిరుపతి

సార్వత్రిక విద్యతో ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవచ్చని డిఇఒ వి.శేఖర్ అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ తిరుచానూరులో తిరుపతి జిల్లా ఓపెన్ స్కూల్స్ అధ్యయన కేంద్రాల సమన్వయ కర్తలతో అడ్మిషన్ల ప్రక్రియపై శనివారం ఒక రోజు సమీక్షా సమావేశం నిర్వహించారు.